క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్‌లో ట్రినిటి విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

సాక్షి, పెద్దపల్లి: గోవాలో ఇటీవల జరిగిన గోవా ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్–2024లో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. మంగళవారం ట్రినిటి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబర్చి సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన ట్రినిటి పాఠశాల విద్యార్థులను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి అభినందించారు.

సాగు పద్ధతులపై అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సిబ్బంది

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రైతువేదికలో సాగు పద్ధతులు, వరి వంగడాలపై మంగళవారం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌తో వ్యవసాయాధికారులు, రైతులకు అవగాహన కల్పించారు. వరిపంట కోత అనంతరం వరి కొయ్యలను కాల్చి వేయకుండా భూమిలో కలియ దున్నడంతో కలగే లాభాల గురించి వివరించారు. ఏడీఏ మురళి, కేవీకే హెడ్ శ్రీనివాస్, ఏవోలు ప్రమోద్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 24వ తేదీన ఎంపీపీ రాసకొండ లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీవో శేషయ్యసూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

బొడ్రాయి వార్షిక వేడుకలు



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని అంగడి బజారులో మంగళవారం శ్రీలక్ష్మి, భూలక్ష్మి సహిత బొడ్రాయి ప్రథమ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామంలోని డీసీఎంఎస్ కార్యాలయం బ్రాంచ్‌లో రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి ప్రకాశ్ తెలిపారు. జీలుగ 30కిలోల బస్తా రెండు ఎకరాల 20గుంటల విస్తీర్ణానికి సరిపోతుందన్నారు. దీని పూర్తిస్థాయి ధర రూ.2790 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.1674, రైతు చెల్లించాల్సిన వాటా రూ.1116 అని పేర్కొన్నారు. అదేవిధంగా జనుము విత్తనాలు 40కిలోల బస్తా పూర్తిస్థాయి ధర రూ.3620, ప్రభుత్వ సబ్సిడీ రూ.2172, రైతు చెల్లించాల్సిన వాటా రూ.1448 అని వివరించారు. కావాల్సిన రైతులు తమ వ్యవసాయభూమి పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. భూమిని సారవంతం చేసి అధిక దిగుబడి పొందేందుకు పచ్చిరొట్టె ఎరువులు దోహదపడుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లక్షా23వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

ఓదెల: మండలంలోని పొత్కపల్లి సొసైటీ ద్వారా 16సెంటర్ల ద్వారా లక్షా23వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, సీఈవో గోలి అంజిరెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని 16సెంటర్ల ద్వారా ఇంకా 30వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లపాటు రవాణా వేగవంతం అవుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సెంటర్లలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. అకాల వర్షాలకు రైతులు అధైర్య పడొద్దన్నారు. ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని, రవాణాను వేగవంతం చేస్తామన్నారు.

ఎండలో ఎండుతూ.. వర్షంలో తడుస్తూ

- బస్‌షెల్టర్ లేక తిప్పలు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు
- కొలనూర్ రైల్వేలెవల్ క్రాసింగ్ వద్ద నీడ సౌకర్యం కల్పించాలని వినతి


ఎండలో నిలబడి బస్సుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ఓదెల: బస్సు, ప్రయివేట్ వాహనాలు వచ్చేదాకా ఎండలో నిల్చోవాల్సిందే. వర్షం వస్తే తడవాల్సిందే. ఇదీ మండలంలోని కొలనూర్ లెవల్ క్రాసింగ్ గేట్ సమీపంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు. కొలనూర్ గేట్ సమీపంలోని బస్‌స్టాప్ నుంచి కొలనూర్, గోపరపల్లె, రెడ్డికాలనీ, హరిపురం, పిట్టల ఎల్లయ్యపల్లె, ఓదెల గ్రామాలకు చెందిన ప్రయాణికులు మాత్రమే కాకుండా రామగిరి, భాగ్యనగర్, సింగరేణి, ఇంటర్‌సిటీ రైళ్ల నుంచి దిగిన పలు గ్రామాల ప్రయాణికులు సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ వైపునకు వెళ్తారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో తిప్పలు పడుతున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు

కొలనూర్ గేట్ నుంచి రెడ్డికాలనీ, కొలనూర్, హరిపురం గ్రామాల విద్యార్థులు పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్‌లోని కళాశాలలకు వెళ్తారు. అయితే బస్‌షెల్టర్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు దృష్టిసారించి రోడ్డుపక్కన బస్‌షెల్టర్ నిర్మించాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సు వచ్చేదాకా ఎండలోనే..



కొలనూర్ రైల్వేగేట్ సమీపంలో ఎలాంటి నీడ సౌకర్యం లేదు. వాహనాలు వచ్చేదాకా ప్రయాణికులు ఎండలోనే వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ఐదు గ్రామాల ప్రయాణికులు, విద్యార్థులు కొలనూర్ రైల్వేగేట్ వద్ద వాహనాలు ఎక్కుతారు. బస్‌షెల్టర్ నిర్మించి, మా ఇబ్బందులు తొలగించాలి. – రాంపల్లి అక్షిత, విద్యార్థి, కొలనూర్

త్వరగా నిర్మించాలి



కొలనూర్ రైల్వేగేట్ కూడలి వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలి. ప్రస్తుతం ఎండలో ఎండుతూ వర్షంలో తడుస్తూ బస్సులు వచ్చేదాకా నిలబడి ఉంటున్నాం. చెట్లకిందనే అందరం కూర్చోవాల్సి వస్తోంది. వర్షం వస్తే ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి. ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి. – యాపాల మాధవి, గోపరపల్లె

అన్నిరకాల వడ్లకు బోనస్ ప్రకటించాలి


నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ప్రకటించడాన్ని నిరసిస్తూ అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అన్నిరకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం సన్నాలకే బోనస్ ఇస్తామని ప్రకటించటం సరికాదన్నారు. రాష్ట్రంలో రైతులు దొడ్డు వడ్లనే ఎక్కువగా సాగుచేస్తారన్నారు. అన్నిరకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, మాజీ ఉపసర్పంచు ఆవుల లత, నాయకులు దేవి రాజేందర్, ఆవుల శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు


బోనంతో ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో గౌడ కులస్తులు మంగళవారం ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో శివసత్తుల పూనకాలతో, నెత్తిన బోనాలతో మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం, చీర సారె, పసుపు కుంకుమలు, బెల్లం పానకం నైవేద్యంగా సమర్పించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు బోనాల కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ జిన్న రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచులు తులా మనోహహర్‌రావు, మాదాసు సతీశ్, అనవేన రాంచంద్రం, నాయకులు సబ్బని రాజమల్లు, బాజీ పటేల్, గౌడకులస్తులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


గోదావరిఖని: పూలమాల వేస్తున్న మేయర్


యైటింక్లయిన్‌కాలనీ: నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని నాయకులు అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. నిర్వహించిన కార్యక్రమంలో రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు దీటి బాలరాజు, మారెల్లి రాజిరెడ్డి, కార్పొరేటర్లు ఎండీ ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విప్రకాశ్, నాయకులు గట్ల రమేశ్, కొప్పుల శంకర్, బొమ్మక రాజేశ్, నాయిని ఓదెలు, సుతారి లక్ష్మణ్ బాబు, సింహాచలం, పంజ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, నాయకులు జక్కుల దామోదర్‌రావు, మార్క రాజు, దేవనపల్లి చక్రపాణి, రాములు, రాజేశం, అవినాష్, సారయ్య నాయక్, సునీత, కళావతి, ఓదెలు, పాషా పాల్గొన్నారు.

జూలపల్లి: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్, అబ్బాపూర్ ఎంపీటీసీ దండె వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు ఈర్ల స్వామి, చొప్పరి సంతోష్, స్వామి, కనుకయ్య, రవి, ఫకీర్ హమ్మద్, గౌస్, సాయి ఉన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ బ్లాక్2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్ కాడె సూర్యనారాయణ, నాయకులు కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, దేవి జనార్దన్ పాల్గొన్నారు.

ఇనాం భూముల కౌలుకు వేలం

సాక్షి, పెద్దపల్లి: శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఇనాం భూముల కౌలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయానికి సంబంధించిన ఇనాం భూములు కౌలుకు ఒక సంవత్సరానికి గాను చేసుకునే నిమిత్తం కౌలు బహిరంగ వేలం ఈనెల 24న 11:30 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం నందు సీల్డు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 183 సర్వే నంబర్ 2–16 తరి బంధంపల్లి ధరావత్ రూ.10వేలు, 934 సర్వేనంబర్ 11.24 కుష్కి పెద్దపల్లి ధరావత్ రూ.50వేలుగా నిర్వహించినట్లు తెలిపారు.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, శ్రీసాయి ఎక్స్ సర్వీస్‌మెన్ కోపరేటివ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ మల్టీ ఎయిడెడ్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడిగా ఎండీ.ఆసిఫ్ ఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి ఎండీ అమీర్, కోశాధికారి వి.సాంబమూర్తి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. నూతన కమిటీ జనరల్ బాడీ సమావేశంలో కాలనీలోని పలు అభివృద్ధి పనులు తీసుకోవాల్సిన కార్యక్రమాలపై తీర్మానం చేశారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆలయంలో గరుడసేవ

ఎలిగేడు: మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి తిరుక్కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో వైభవంగా గరుడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, భాగవతచరణరేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



జ్యోతినగర్: పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో తెలియదు కానీ ప్రజలు ఇలాంటి గుంతల రోడ్లపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్నపూర్ణకాలనీలోని అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేయడంతో పాటు కొత్తగా రోడ్లను నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయించాలి


టాయిలెట్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపించాలని అంతర్గాం ఎంపీడీవో ఎంఏ.అలీం సూచించారు. మంగళవారం అంతర్గాం మండల పరిధిలోని మద్దిపల్లి, బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి, సోమనపల్లి, విసంపేట, మద్దిర్యాల, ఎగ్లాస్‌పూర్, పొట్యాల తదితర పాఠశాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా సమాఖ్య సంఘాల ప్రతినిధులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

రాంచంద్రారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని పని చేస్తా


ఎమ్మెల్యేతో ఏడీవీటీ డైరెక్టర్ రాజప్రసాద్‌రెడ్డి

ఎలిగేడు: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ రాంచంద్రారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లిలో ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో మంగళవారం సాక్షి మీడియా సంస్థల ఏడీవీటీ డైరెక్టర్ కాల్వ రాజప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కాల్వ రాంచంద్రారెడ్డితో తనకున్న అనుబంధాన్ని జ్ఞాపకాలను కేఆర్‌పీరెడ్డితో పంచుకున్నారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి రాంచంద్రారెడ్డి చేసిన సేవలను నియోజకవర్గ ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకోవడం ఆయన ప్రజాసేవకు తార్కాణమని అన్నారు. కేఆర్‌పీరెడ్డి కుటుంబసభ్యులు కాల్వ ప్రభాకర్‌రెడ్డి, కాల్వ అశోక్‌రెడ్డి, కాల్వ వెంకటేశ్వర్ రెడ్డి ఉన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం


టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్: నిరుపేద కుటుంబాలకు చేయతనందిస్తూ, ఆపదలో ఉన్న వారికి ఆర్థికసాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ టీం చేపడుతున్న సేవలు అభినందనీయమని కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కల్వల సతీశ్ టీ స్టాల్ పెట్టుకోవడానికి హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీశ్, అసం శ్రీకాంత్ రూ.21వేలతో టీక్యాబిన్‌ను అందించారు. కాగా రామకృష్ణారెడ్డి మంగళవారం ప్రారంభించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులను అభినందించారు. నల్లవెల్లి శంకర్, మేడగోని విజయ్, అనవేన లక్ష్మీరాజం, బుర్ర శ్రీనివాస్, మల్యాల విజయ్, నరేశ్, మహేశ్, రెడ్డి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అకాడ శిక్షణ శిబిరం ప్రారంభం


కర్ర సాము ప్రదర్శిస్తున్న అరుణ్

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని మల్లికార్జుననగర్‌లో అకాడ మాస్టర్ అడ్డూరి వెంకటయ్య ఆధ్వర్యంలో చిన్నారులకు శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు సోమారపు అరుణ్, లావణ్య హాజరై శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం అరుణ్ కర్రసామును ప్రదర్శించారు. నాయకులు పంగ రవి, రాజేశ్, శ్యాం పాల్గొన్నారు.

బుద్ధ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

జూలపల్లి: ఈ నెల 23న జరిగే బుద్ధ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ మొగురం రమేశ్ అన్నారు. మండల పరిధిలోని వడ్కాపూర్ వద్ద ఉన్న అత్యంత పురాతన, చారిత్రాత్మక బౌద్ధ స్తూపం వద్ద నిర్వహించే ఉత్సవాలకు మహారాష్ట్ర నుంచి ప్రత్యేక పూజలు చేసేందుకు బౌద్ధసన్యాసులు రానున్నారని తెలిపారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..

వడ్కాపూర్ బౌద్ధ స్తూపం వద్ద జయంతోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు కమిటీ అధ్యక్షుడు రమేశ్ తెలిపారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

రామగుండం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. అంతర్గాం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు చంద్రయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో అధికారుల జాప్యంతోనే కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దయిందన్నారు. అదేవిధంగా మండలానికి కేటాయించిన మిల్లులో వివిధ రకాల పేరుతో కోతలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గరిష్ట ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఆరబెట్టిన నాలుగు గంటల్లోపే ధాన్యం తేమశాతానికి వస్తుందని, సత్వరమే తూకం వేసి లారీల్లో మిల్లులకు పంపించాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఐ.కృష్ణ, ఈ.నరేశ్, కొల్లూరి మల్లేశ్, వేల్పుల సాంబయ్య, తమ్మనవేణి రాజకొమురయ్య, పైడిపల్లి రమేశ్, కోడిపుంజుల భూమేశ్, లింగంపల్లి శంకర్, మోటం కుమార్ ఉన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి తండా బి గ్రామంలో సద్గురు సేవాలాల్ జగదాంబ మేరామా ఆలయ నిర్మాణ పనులను మంగళవారం మాజీ ఎంపీపీ కొడారి అంజన్న ప్రారంభించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, చింతల ప్రదీప్‌రెడ్డి, సేవాలాల్ ఆలయ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, ఉపాధ్యక్షుడు చంద్రానాయక్, ప్రధాన కార్యదర్శి జితేందర్‌నాయక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వాళ్లకు పాఠాలు బోధించిన గురువులు శ్రీనివాస్‌రావు(ఆర్టీవో), వలియోద్దిన్, మందగట్టయ్య, రాజగోపాల్‌ను సన్మానించారు. అనంతరం ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థులు సదయ్య, వంశీకృష్ణ, పుష్పలత, వనజ, దేవేంద్ర, కుమార్, మల్లేశ్, భాస్కర్, మధు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా:
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899